సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 15 । మే । 2025





**సుందరాంగుల విందు**
మిస్ వరల్డ్ పోటీదారులు బుధవారం హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తూ భువనగిరిలో కొద్దిసేపు ఆగారు. - 8లో



**పిల్లలకు ఆహ్లాదం**
చిన్నారులకు గురువారం నుంచి ఈనెలాఖరు వరకు వేసవి శిబిరాలు నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. - 9లో

గరిష్ఠం/కనిష్ఠం
38°/27°

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### యాదగిరి క్షేత్రంలో నిత్యపూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం వంటి సంప్రదాయ పూజలను నిర్వహించారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలను విశేషంగా జరిపించారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం జరిపించి, ద్వారా బంధనం చేశారు.

### పంటల మార్పిడితో అధిక దిగుబడులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

భువనగిరి : రైతులు పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధిస్తూ.. సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం యాకాద్రి అన్నారు. బుధవారం మండలంలోని చందుపట్ల గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల మార్పిడి విధానం తో నేల సారం పరిరక్షించబడుతుందన్నారు. పరిమిత నీటితో సాగు చేయవచ్చన్నారు. అనంతరం పంటల సాగు విధాన పై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగులో మెలుకువలకు సంబంధించి పాటించవల్సిన నియామలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మధుశేఖర్, భూగర్భ నీటి విభాగం అధికారి అశ్విత్, ఏఓ మల్లేష్, ఏఈఓ మల్లేష్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ కొండల్‌రెడ్డి, అభ్యుదయ రైతులు సిద్దారెడ్డి,రాములు, కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ కృష్ణయ్య, విజయకాంత్, రూప తదితరులు పాల్గొన్నారు.

### యువ వికాసం దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ

ఆలేరురూరల్: యువ వికాసం పథకం దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యామ్ సుందర్ అన్నారు. బుధవారం ఆలేరు మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను వారు పరిశీలించి మాట్లాడారు. ఆలేరు మండల పరిధిలో 1,809 దరఖాస్తులు చేసుకోగా ఇందులో 1,425 మంది ఎంపీడీఓ కార్యాలయంలోనే అందజేశారని ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్ తెలిపారు. వారి వెంట మండల స్పెషల్ అధికారి గోపాల్ తదితరులు ఉన్నారు.

### అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీల్లో అడ్మిషన్ల కోసం మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో అడ్మిషన్ దరఖాస్తుల స్వీకరణ, 2024-25 విద్యా సంవత్సరం సాధించిన ఫలితాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎండబ్ల్యూఓ నరసింహారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌నాయక్, డీటీడీఓ శంకర్ పాల్గొన్నారు.

# అందగత్తెలకు ఆతిథ్యం

## నేడు భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్టలో మిస్ వరల్డ్ పోటీదారుల పర్యటన



యాదగిరి క్షేత్ర దర్శనం అనంతరం సుందరీమణులు ఫొటోలు దిగేందుకు ఏర్పాటు చేసిన వేదిక

- శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోనున్న సుందరీమణులు
- టూరిజం పార్కులో చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియల పరిశీలన
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

సాక్షి, యాదాద్రి, యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి : మిస్ వరల్డ్ పోటీలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించనున్నారు. యాదగిరిగుట్ట క్షేత్రాని ఓ బృందం, భూదాన్‌పోచంపల్లిలో మరో బృందం సందడి చేయనుంది. వీరి పర్యటన కోసం టూరిజం శాఖతోపాటు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.

**నారసింహుడి క్షేత్రంలో ప్రత్యేక పూజలు**
వివిధ దేశాలకు చెందిన పది మంది సుందరీమణుల బృందం గురువారం సాయంత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి రానుంది. వీరు ప్రత్యేక బస్సులో హైదరాబాద్ నుంచి యాదగిరి కొండపైకి చేరుకుంటారు. కొండపైన అతిథి గృహం నుంచి ప్రత్యేక బ్యాటరీ వాహనాల్లో అఖండ దీపారాధన వద్దకు చేరుకుని దీపాలు వెలిగిస్తారు. అనంతరం గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. సువర్ణ పుష్పార్చనలో పాల్గొంటారు. వేద పండితులు సుందరీమణులకు ఆశీర్వచనం చేసి, శ్రీస్వామి వారి చిత్రపటాలు, లడ్డూ ప్రసాదాలను అందజేస్తారు. దర్శనం తర్వాత ముఖ మండపంలో పలు ప్రాంతాలను వీక్షిస్తారు. అనంతరం స్వర్ణ విమాన గోపురం వద్ద ఆలయమంతా కనిపించేలా ఫొటోలు దిగుతారు.

**ఆలయంలో ఏర్పాట్లు.. బ్రేక్ దర్శనం రద్దు**
సుందరీమణులు యాదగిరి క్షేత్రానికి వస్తున్న నేపథ్యంలో ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానాలయ ముఖ మండపం, మహా రాజగోపురాలను అలంకరించారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం భక్తులకు కల్పించే బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. దీంతో పాటు జోడు సేవలను రద్దు చేశారు. సుందరీమణులు వెళ్లిన తరువాత భక్తులకు శ్రీస్వామి వారి దర్శనాలను కొనసాగిస్తారు.

**సంస్కృతికి పెద్దపీట**
కాగా టూరిజం పార్కులో చేనేతకు ప్రాధాన్యత మిస్తూనే మన సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వాతావరణం ప్రతిబింబించేలా పెద్ద పీట వేస్తూ అధికారులు ఏర్పాట్లు చేశారు. తెలంగాణ పండుగల ప్రాశస్త్యాన్ని తెలియజేసే బతుకమ్మ, ఎడ్లబండి ప్రదర్శన, పల్లెలోని గుడిసె సెట్ వేసి అందులో చేనేత స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచ సుందరీమణులకు స్థానిక మహిళలు బొట్టుపెట్టడం, పూలమాలలు వేసి సత్కరించనున్నారు. ఈ సందర్భంగా టూరిజం పార్కుతోపాటు పలు ప్రాంతాలను రంగురంగుల లైట్లతో తీర్చిదిద్దారు.

**పోచంపల్లికి 25 మంది అందాలభామలు**
ఇక్కత్ వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచి, యునెస్కో అనుబంధ సంస్థచే ఉత్తమ పర్యాటక గ్రామంగా అంతర్జాతీయ అవార్డు అందుకున్న భూదాన్‌పోచంపల్లిని గురువారం సాయంత్రం 6 గంటలకు 25 మంది సుందరీమణులు సందర్శిస్తారు. టూరిజం పార్కులోని మ్యూజియంలో దారం నుంచి చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలిస్తారు. వీరికి సింగిల్ ఇక్కత్, డబుల్ ఇక్కత్, తేలియా రుమాలు, చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను వివరిస్తారు. హంపీ థియేటర్‌లో మోడల్స్‌చే నిర్వహించే ర్యాంప్ వాక్‌ను తిలకిస్తారు. పద్మశ్రీ గజం గోవర్ధన్, జాతీయ, రాష్ట్ర అవార్డు గ్రహీతలైన తడక రమేశ్, సాయిని భరత్, బోగ బాలయ్య, ఎన్నం మాధవి శివకుమార్, చేనేత సహకార సంఘం, పోచంపల్లి టై అండ్ డై అసోషియేషన్ల ఆధ్వర్యంలో పది స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.





హంపీ థియేటర్‌లో మోడల్స్ ర్యాంప్‌వాక్ కోసం చేస్తున్న ఏర్పాట్లు, కనువిందు చేస్తున్న స్వాగత ద్వారం

**యాదగిరిగుట్టలో పర్యటన ఇలా..**
- అందగత్తెలు సాయంత్రం 5 గంటలకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అతిథిగృహానికి చేరుకుంటారు.
- 5:10– 5:20 గంటల వరకు అఖండ దీపారాధనలో పాల్గొంటారు.
- 5:20 – 5:30 వరకు స్థానిక కళాకారుల కోలాటం, సంప్రదాయ భజన, శాస్త్రీయ నృత్య బృందాలతో తూర్పు గోపురానికి వెళ్తారు.
- 5:30 – 5:40 ఆలయ ప్రాంగణంలో ఫొటో షూట్
- 5:50– 6 గంటల వరకు గర్భాలయంలో ప్రత్యేక పూజ, పంచనారసింహస్వామి దర్శనం
- 6:10 – 6:25 వరకు ఆలయ ప్రాంగణంలో గల శిల్పకళపై ఫొటో సెషన్.
- 6.30 – 6.40 : ఆలయ ప్రొటోకాల్ గెస్ట్ హౌస్‌లో అతిథులకు టీ, స్నాక్స్ అనంతరం కొంతసేపు సేదదీరుతారు.
- సాయంత్రం 6:40 గంటలకు గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో తిరిగి హైదరాబాద్ వెళ్తారు.

**పోచంపల్లిలో..**
- సాయంత్రం 6 గంటలకు పోచంపల్లి టూరిజం పార్క్‌కు చేరుకుంటారు.
- 6:10 గంటల వరకు కోలాట బృందాలు తెలంగాణ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకుతాయి.
- 6:10 నుంచి 6:25 గంటల వరకు మ్యూజియం టూర్, మగ్గం వర్క్ గురించి వారికి చేనేత కళాకారులు వివరిస్తారు.
- టూరిజం పార్క్ ప్రాంగణంలో మెహందీ, లైవ్ మ్యూజిక్ కార్యక్రమంలో పాల్గొంటారు.
- రాత్రి 7:05 నుంచి7:30 గంటల వరకు మిస్ వరల్డ్ పోటీదారులు చేనేత జౌళి శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు.
- 7:40 నుంచి 7:45 : తెలంగాణ టూరిజం రూపొందించిన అధికారిక వీడియో ప్రదర్శనను వీక్షిస్తారు.
- 7:45 నుంచి 8:15 గంటల వరకు తెలంగాణ హ్యాండ్లూమ్ ప్రదర్శన ఉంటుంది. ఇక్కడే స్థానిక మోడల్స్ తెలంగాణ చేనేత వస్త్రాలతో తయారు చేసిన దుస్తులను ధరించి సుందరీమణుల ముందు ప్రదర్శిస్తారు.
- 8:30 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.

# మిస్ వరల్డ్ పోటీదారులకు అసౌకర్యం కలగొద్దు

- స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి



టూరిజం పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుంభం, స్టేట్‌ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, కలెక్టర్ తదితరులు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లికి రానున్న మిస్ వరల్డ్ పోటీదారులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూడాలని పోచంపల్లి ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, ఐఏఎస్ డాక్టర్ లక్ష్మి అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ హనుమంతరావు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌తో కలిసి పోచంపల్లి టూరిజం పార్కును సందర్శించారు. అక్కడ చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. స్వాగతం పలకడం నుంచి చివరి ప్రొగ్రామ్ ర్యాంప్‌వాక్ వరకు చేస్తున్న కార్యక్రమాలపై రిహార్సల్స్ చేపట్టారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గురువారం సాయంత్రం 6 గంటలకు ఆఫ్రికా దేశాలకు చెందిన 25 మంది సుందరీమణులు పోచంపల్లికి రానున్న సందర్భంగా న్నారు. టూరిజం పార్కులో ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు చేనేత వస్త్రాల ప్రాముఖ్యత, వస్త్రాల తయారీ విధానాలను స్వయంగా తెలుసుకొంటారని అన్నారు. అలాగే హంపీ థియేటర్‌లో 20 మంది మోడల్స్‌చే ఇండో వెస్ట్రన్ కలగలిపిన చేనేత వస్త్రాలతో నిర్వహించే ర్యాంప్‌వాక్‌ను తిలకిస్తారన్నారు. కాగా ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, జిల్లాలోని ప్రముఖులు, పద్మశ్రీలు, చేనేతలో అవార్డుగ్రహీతలను ఆహ్వానించామని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం తిరిగి రాత్రి హైదరాబాద్‌కు వెళ్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం జీఎం ఉపేందర్‌రెడ్డి, డీపీఓ సునంద, డీసీపీ అకాంక్ష్‌యాదవ్, ఏసీపీ మధుసూధన్‌రెడ్డి, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, సీఐ రాములు, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, నాయకులు తడక వెంకటేశం, పాక మల్లేశ్, తడక రమేశ్, భారత లవకుమార్, మర్రి నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ భూములు అమ్మినా.. కొన్నా నేరమే

- కలెక్టర్ హనుమంతరావు



ఆత్మకూరు(ఎం)లో రెవెన్యూ సదస్సులో దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

ఆత్మకూరు(ఎం): నిరుపేద రైతుల జీవనోపాధి కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను అమ్మినా, కొన్నా నేరమే అవుతుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా బుధవారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంతోపాటు కొరటికల్‌లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. తక్కువ ధరకు వస్తాయని అసైన్డ్‌మెంట్ భూములను కొనుగోలు చేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని చెప్పారు. భూసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. అంతకుముందు ఆత్మకూరు(ఎం) రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆత్మకూరు(ఎం) తహసీల్దార్ వి.లావణ్య, వలిగొండ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సదస్సుల్లో ఆత్మకూరు(ఎం) డీటీ ఎండీ. షఫియొద్దీన్, భువనగిరి డీటీ ప్రణయ్, ఆర్ఐలు వై.మల్లిఖార్జునరావు, పాండు, మండల సర్వేయర్ స్వప్న, కంప్యూటర్ ఆపరేటర్ వనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనగోళ్లు పూర్తిచేయాలి



ముత్తిరెడ్డిగూడెం కొనుగోలు కేంద్రంలో వివరాలు అడుగుతున్న కలెక్టర్

మోటకొండూర్: వరి ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. బుధవారం మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం ఎందుకు జరుగుతుందని, రైతుల వివరాలను వెంటనే ఎందుకు నమోదు చేయడం లేదని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో దళారులు ధాన్యం విక్రయిస్తున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట కేంద్రం నిర్వాహకులు, అధికారులు, రైతులు ఉన్నారు.

### వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి : ఈ నెల 15 నుంచి ఈనెలాఖరు వరకు నిర్వహించే వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి 9వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు రావొచ్చని పేర్కొన్నారు.

# కరువు నేలన జలసిరులు

## చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటల్లో వర్షపు నీటి నిల్వ

- పెరుగుతున్న భూగర్భ జలాలు
- వేసవిలోనూ బోర్లు, బావుల్లో సమృద్ధిగా నీరు
- తాగు, సాగునీటి సమస్యకు చెక్
- నీటి సంరక్షణతో కరువును జయిస్తున్న పల్లెలు



పెన్‌పహాడ్ మండలం నాగులపహాడ్‌లో మూసీపై నిర్మించిన చెక్ డ్యామ్ పరవళ్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నీటికి నిలకడ నేర్పితే కరువుఛాయలు దరిచేరవు. వాన నీటిని ఒడిసిపడితే జీవ వైవిధ్యం అలరారుతుంది. ఈ తరహాలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం, వరద, వృథా నీటిని నిల్వ చేస్తూ చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటలు, కందకాలు నిర్మించడం ద్వారా ఏ కాలమైనా నీటికి ఢోకా ఉండడం లేదు. వీటి నిర్మాణంతో సాగు నీటి సమస్య నుంచి రైతులు బయటపడ్డారు. ఆయా ప్రాంతాల్లో పశుపక్ష్యాదులకు నిరంతరం నీరు దొరుకుతోంది. సమగ్ర నీటి సంరక్షణ చర్యలతో ఆయా పల్లెలు కరువును జయించాయి.

**అష్టకష్టాల నుంచి గట్టెక్కి..**
సూర్యాపేట మండలంలో గతంలో వేసవి ప్రారంభంలోనే ఎండిన చెరువులు, అడుగంటిన బోరు బావులతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. తాగు నీటి కోసం మైళ్ల దూరం నడిచి వెళ్లి తెచ్చుకునే పరిస్థితి ఉండేది. తలాపున మూసీ నది ఉన్నా గుక్కెడు నీళ్లు దొరక్క, పంటలు పండని పరిస్థితి నుంచి ఇప్పుడు ఈ ప్రాంతం పూర్తిగా మారిపోయింది. గత ప్రభుత్వం మూసీ నది కింద 9 చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టి, ఆరింటిని పూర్తి చేసింది. టేకుమట్ల–2, రాయినిగూడెం–2, కాసారాబాద్–2 నిర్మాణం పూర్తి కాగా, ఝెడ్లపల్లి–1, కేటీ అన్నారం –1, కాసారాబాద్–1 నిర్మాణాలు పూర్తి కావొచ్చాయి. ఇప్పటికే పూర్తయిన నిర్మాణాలతో మండల పరిధిలోని భూగర్భ జలాలు పెరిగి ప్రజలకు తాగునీటి సమస్య తగ్గిపోయింది. బోరు బావులు, ఊట బావుల్లో నీరు సమృద్ధిగా ఉంటోంది. చెక్ డ్యామ్‌లలో నిల్వ ఉన్న నీటిని రైతులు మోటార్ల ద్వారా పొలాలకు తరలించుకుని పంటలు సాగుచేస్తున్నారు.

**చెక్ డ్యామ్‌లతో తీరిన నీటి సమస్య**
పెన్‌పహాడ్ మండలంలో భూగర్భ జలాలు పెరిగేందుకు చెక్‌డ్యామ్‌లు దోహదపడుతున్నాయి. మండలంలోని దోసపహాడ్, అనాజీపురం, నాగులపహాడ్ గ్రామాల పరిధిలోని మూసీ నదిపై ఆరు చెక్ డ్యామ్‌లు నిర్మించారు. వీటి నిర్మాణంతో చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగాయి. వ్యవసాయ ఆధారిత బోర్లు, బావుల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో ప్రజలకు వేసవిలో తాగునీటి నీటి సరఫరాలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు.

**ప్రతి వర్షపు చినుకు ఇంకేలా..**
కరువు నేలలో జలాలను నిల్వ చేసి జీవం పోయడానికి పీఎం కృషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) పథకం కింద యాద్రాది భువనగిరి జిల్లాలో సంస్థాన్ నారాయణపురం మండలాన్ని ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని జనగాం, పుట్టపాక, వావిళ్లపల్లి, చిల్లాపురం, కొత్తగూడెం సహా 16 గ్రామాల్లో ఈ పథకాన్ని గతేడాది నుంచి అమలు చేస్తున్నారు. అక్కడ ప్రతి వానచినుకు భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టారు. కొండలు, వాలు ప్రాంతాల్లో పైనుంచి వచ్చే నీటిని భూగర్భ జలంగా మార్చేలా చెక్‌డ్యామ్‌లు, ఊట చెరువులు నిర్మించారు. పొలాల నుంచి మట్టి కొట్టుకుపోకుండా అడ్డుగా రాతి కట్టలు, కందకాల తవ్వకం చేపట్టారు. ఇప్పటి వరకు 68 పనులు పూర్తి చేశారు.



సూర్యాపేట మండలం కాసరబాద వద్ద మూసీనదిపై నిర్మించిన చెక్ డ్యామ్



సంస్థాన్ నారాయణపురం మండలం పొర్లగడ్డలోని ఆటవీ ప్రాంతంలో నిర్మించిన నీటి ట్యాంక్

### వాన నీటిని ఒడిసి పడుతున్న రైతు



సత్యనారాయణరెడ్డి వ్యవసాయ క్షేత్రంలోని నీటి కుంట

వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు చండూరు మండలానికి చెందిన రైతు పాల్వాయి సత్యనారాయణరెడ్డి ప్రయత్నం అభినందనీయమే. తనకున్న భూమిలో ఆరేళ్ల కిందటే భూగర్భ జలాలను పెంపొందించేందుకు కందకాలు తవ్వించారు. నాలుగు ఎకరాల్లో ఫాం పాండ్‌లు, నీటిని నీటి గుంతలు తవ్వించారు. ఎండలు మండుతున్నా ఆయన వ్యవసాయ క్షేత్రంలో నీటి నిల్వలు అలాగే ఉన్నాయి. ఆ నీటితోనే వ్యవసాయ క్షేత్రంలో మామిడి, సపోట, కొబ్బరి, సీతాఫలం, నిమ్మ తోటలు, జొన్న చేను సాగు చేస్తున్నారు. అంతర పంటలుగా టమాట, కర్బూజ, బూడిద గుమ్మడికాయ, దోసకాయ, బీరకాయ వంటివి పండిస్తున్నారు. అంతేకాదు వేప, జామాయిల్, కానుగ చెట్లను సైతం పెంచుతున్నారు. ఇప్పుడు ఆయన వ్యవసాయ క్షేత్రం అంతా పచ్చదనంతో నిండిపోయింది.

### శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సూచనలతోనే నీటి సంరక్షణ



రిటైర్డ్ ఇంజనీర్ మేరెడ్డి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి సూచనలతోనే నీటి సంరక్షణకు చర్యలు చేపట్టా. ఒకసారి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అర్థమయ్యేలా చెప్పారు. దాంతో 50 ఎకరాల చుట్టూ కందకాలు తవ్వించా. ఐదెకరాలకు ఒకటి చొప్పున నీటి గుంతలను తవ్వించా. అంతకు ముందు మా భూమిలో జియాలజిస్టులు బోర్లు పడవన్నారు. ఇప్పుడు అదే భూమిలో 3 బోర్లు వేశా. భూగర్భ జలాలు పెరిగి, నీరు బాగా పోస్తున్నాయి.

- పాల్వాయి సత్యనారాయణరెడ్డి, చండూరు

### బోరు బావుల్లో సమృద్ధిగా నీరు



మూసీ నదిపై చెక్ డ్యామ్‌లు నిర్మించడం వల్ల గ్రామంలో బోర్లు, బావులు ఎండిపోలేదు. సమృద్ధిగా నీరు రావడంతో నీటి కొరత తలెత్తలేదు. గతంలో వేసవి వచ్చిందంటే బోర్లు, బావుల్లో నీరు తగ్గిపోయి ఇబ్బందులకు గురయ్యేవాళ్లం. చెక్ డ్యామ్‌లు నిర్మించాక నీటి సమస్యకు పరిష్కారం లభించింది.

- వెంకట్‌రెడ్డి, దోసపహాడ్, పెన్‌పహాడ్ మండలం

### నీటి బాధ తప్పింది



రెండేళ్ల కిందటి వరకు మా గ్రామంలో నీటి సమస్య బాగా ఉండేది. మూసీ నదిలో బావి తవ్వకొని ఒడలు (రింగ్‌లు) ఏర్పాటు చేసుకునే వాళ్లం. ఒక్కోసారి నీరు అందక మోటార్లు కాలిపోయేవి. చెక్‌డ్యామ్‌లు నిర్మించాక ఆ సమస్యలు తొలగిపోయాయి. రెండు పంటలకు నీరు అందుతోంది.

- సంకరమద్ది రమణారెడ్డి, కాసరబాద

### రైతులకు మేలు



గ్రామంలో వేసవి కాలంలో బోర్లు, బావులు ఇంకిపోయేవి. పక్కన మూసీ నది ఉన్నా తాగడానికి పనికి రావు. ప్రస్తుతం చెక్ డ్యామ్ వల్ల భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీరు సరిపడా లభ్యమవుతోంది. రైతులకు ఎక్కువ మేలు జరుగుతోంది.

- జంపాల శ్రీనివాస్, టేకుమట్ల

### రైతులను ప్రోత్సహించాలి



వాటర్‌షెడ్ పథకంలో భాగంగా అన్ని వాగుల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టారు. నీరు వృథాగా పోకుండా ఇంకుడు గుంతలు, ఊట కుంటలు నిర్మించాలి. వృథాను అరికట్టేలా రైతులకు మెళకువలు నేర్పించాలి.

- కొండూరి స్వామి, జనగాం, నారాయణపురం మండలం

## క్లుప్తంగా

### అమెరికాలో పందెనపల్లి యువతి మృతి

● స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి


ప్రియాంకరెడ్డి (ఫైల్)

కట్టంగూర్: ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన కట్టంగూర్ మండలం పందెనపల్లి గ్రామానికి చెందిన యువతి బ్రెయిన్‌డెడ్ అయ్యి మృతిచెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, యువతి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పందెనపల్లి గ్రామానికి చెందిన కొండి వెంకట్‌రెడ్డి, శోభారాణి దంపతుల కుమార్తె ప్రియాంకరెడ్డి (26) అమెరికాలోని అలబామా స్టేట్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ ఎమ్మెస్సీ(మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ అగ్రికల్చర్) పూర్తిచేసి అక్కడే పార్ట్‌టైం జాబ్ చేస్తోంది. ప్రియాంక ఈ నెల 6వ తేదీన తాను ఉంటున్న ఇంట్లోని బాత్‌రూంలో పడిపోయింది. స్నేహితులు గమనించి ఆమెను ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. ఒక రోజు చికిత్స అందించిన వైద్యులు ప్రియాంక తల్లిదండ్రులతో మాట్లాడి వెంటిలేటర్ తీసివేయటంతో ఈ నెల 8న ఆమె మృతిచెందింది.ప్రియాంక మృతదేహం బుధవారం స్వగ్రామం పందెనపల్లికి చేరుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య ప్రియాంక అంత్యక్రియలు పూర్తిచేశారు.

### కుటుంబ తగాదాలతో వివాహిత ఆత్మహత్య


నవ్య (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: కుటుంబ తగాదాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గోశిక భాస్కర్‌కు అదే గ్రామానికి చెందిన నవ్య(34)తో 11ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భాస్కర్ చేనేత కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నవ్య భర్తకు చేదోడువాదోడుగా ఉంటోంది. భాస్కర్ ఇటీవల కాలంలో మద్యానికి బానిస కావడంతో కుటుంబంలో తగాదాలు జరుగుతున్నాయి. మంగళవారం భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. క్షణికావేశంలో నవ్య చేనేత రంగుల్లో ఉపయోగించే నైట్రేట్ రసాయనాన్ని తాగింది. ఇది గమనించిన భాస్కర్ ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తమ్ముడు రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి. మన్మథకుమార్ తెలిపారు.

### స్వర్ణగిరీశుడికి తిరువీధి ఉత్సవ సేవ


తిరువీధి ఉత్సవ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి ఆలయంలో వేంకటేశ్వర స్వామికి బుధవారం తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, అష్టదళ పాదపద్మార్చన సేవ, నిత్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 3వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారికి మంగళహారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


అనంతారం నుంచి పొట్లపహాడ్ వెళ్లే రహదారిలో..


పొట్లపహాడ్ నుంచి అన్నారం వెళ్లే దారిలో చెట్లు

### చల్లని నీడ తోడుగా

హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు పెరిగి చెట్లుగా మారడంతో పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం నుంచి పొట్లపహాడ్, మాచారం నుంచి పొట్లపహాడ్ వెళ్లే రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు దర్శనిమిస్తున్నాయి. వేసవిలో ఈ దారి గుండా ప్రయాణం చేసే వాహనదారులకు ఎంతో ఉపశమనం కలుగుతోంది. - పెన్‌పహాడ్

# భువనగిరిలో సుందరాంగుల విందు

● వరంగల్ పర్యటనకు వెళ్తూ మధ్యలో ఆగిన 56 మంది అందాల భామలు
● ఖిలాను ఆసక్తిగా తిలకించిన అందగత్తెలు



వివేరా హోటల్‌లో విందు అనంతరం గ్రూప్ ఫొటో దిగుతున్న అందాల భామలు


భోజనం కోసం ఏర్పాటు చేసిన వంటకాల శాంపిల్స్ సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

భువనగిరిటౌన్: వివిధ దేశాలకు చెందిన 72 మంది మిస్ వరల్డ్ పోటీదారులు బుధవారం హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తూ మార్గమధ్యలో భువనగిరిలోని వివేరా హోటల్‌లోని వి కన్వెన్షన్ హాల్‌లో కొద్దిసేపు ఆగారు. 34 మందితో కూడిన మొదటి బృందం మధ్యాహ్నం 12.45గంటలకు మూడు బస్సుల్లో వి కన్వెన్షన్ హాల్‌కు చేరుకుని ఒక గంట పదిహేను నిమిషాల పాటు సేదతీరారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు వారు వరంగల్‌కు ప్రయాణమయ్యారు. అనంతరం 22 మందితో కూడిన రెండో బృందం సుమారు 25 నిమిషాల పాటు వి కన్వెన్షన్ హాల్‌లో స్నాక్స్ తిని వెళ్లారు. భువనగిరి ఖిలాను బస్సుల్లో నుంచి సుందరీమణులు తిలకించారు.

**సంప్రదాయ వంటకాలు వడ్డింపు..**

సుందరీమణులకు వి కన్వెన్షన్ హాల్‌లో వారివారి దేశాలకు చెందిన 19 రకాల సంప్రదాయ వంటలను వివేరా హోటల్ యజమానులు తయారు చేసి వడ్డించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి ఆధ్వర్యంలో వంటకాలను తనిఖీ చేసిన అనంతరం వారికి విందు భోజనం పెట్టారు. అనంతరం వారు కన్వెన్షన్ హాల్‌లో కలియ తిరిగారు.

**120 మంది పోలీసులతో భద్రత**

అందాల భామలు వస్తున్న నేపథ్యంలో వి కన్వెన్షన్ హాల్ వద్ద 120మంది పోలీసులతో భారీ భద్రత కల్పించారు. హోటల్‌కు వచ్చే వారిని పాసులు ఉంటేనే అనుమతి ఇచ్చారు. భద్రతా ఏర్పాట్లను రాచకొండ సీపీ సుధీర్‌బాబు, భువనగిరి డీసీపీ అక్షాన్స్ యాదవ్, ఏఎస్పీ కంకణాల రాహుల్‌రెడ్డి, పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ పరిశీలించారు. అంతకుముందు సుందరీమణులకు హోటల్ యజమాని సద్ది వెంకట్‌రెడ్డి స్వాగతం పలికారు. గూడూరు టోల్‌ప్లాజా నుంచి ప్రధాన చౌరస్తాల వద్ద కూడా పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు.

### భామలను చూసి కేరింతలు

ఆలేరు: ఆలేరు మీదుగా వరంగల్‌కు ప్రత్యేక బస్సుల్లో వెళ్తున్న సుందరీమణులను చూసేందుకు బహుపేట క్రాస్ రోడ్ నుంచి పెంబర్తి కాకతీయ కమాన్ వరకు బుధవారం స్థానికులు గుమిగూడారు. మధ్యాహ్నం 2.50గంటలకు బస్సు ఆలేరు సాయిబాబా గుడి సమీపంలోకి చేరుకోగానే స్థానికులు కేరింతలు కొట్టగా.. ప్రతిస్పందనగా సుందరీమణులు అభివాదాలు చేశారు. సుందరీమణులు ప్రయాణించే రూట్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆలేరు సీఐ కొండల్‌రావు, ఎస్‌ఐ రజనీకర్ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ అంజనేయులుతో పాటు 25 మంది కానిస్టేబుళ్లు, 10మంది ట్రాఫిక్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

### శిశు మరణాల నివారణకు ఊయల దోహదం

మర్రిగూడ : శిశు మరణాల నివారణకు ప్రభుత్వం చేపట్టిన ఊయల కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని సీడీపీఓ సక్కుబాయి అన్నారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు ఊయల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనారోగ్యంతో జన్మించిన శిశువులను కాపాడేందుకు కేంద్రం మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా దేశంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఊయలలను ఏర్పాటు చేసిందన్నారు. ఎవరైనా ఈ పిల్లలను దత్తత తీసుకోవాలనుకుంటే వారికి చట్టపరంగా దత్తత ఇస్తారని తెలిపారు.

# అప్పులు చేసి ఐపీఎల్ బెట్టింగ్

● జెర్రిపోతులగూడెంలో రూ.2కోట్ల వరకు అప్పులు చేసి పరారైన నిందితుడు

చిలుకూరు: చిలుకూరు మండలం జెర్రిపోతులగూడేనికి చెందిన వ్యక్తి అప్పులు చేసి ఐపీఎల్ బెట్టింగ్ పెట్టి నష్టపోయాడు. అప్పులు ఇచ్చిన వారు తమ డబ్బులు తమకు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో పరారయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు.. జెర్రిపోతుగూడేనికి చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. అతడి కుటుంబానికి గ్రామంలో మంచి పేరు ఉండడంతో.. అతడు అడిగిన వెంటనే గ్రామస్తులు అప్పు ఇచ్చారు. అప్పుగా తీసుకున్న డబ్బులను ఆన్‌లైన్‌లో ఐపీఎల్ బెట్టింగ్ పెట్టాడు. మొదట్లో కొన్ని డబ్బులు బెట్టింగ్‌లో పోవడంతో ఆ అప్పులు తీర్చడం కోసం మళ్లీ బెట్టింగ్ పెట్టారు. గ్రామంలో అతడికి 3 ఎకరాల వరకు పొలం ఉండడంతో అడిగిన ప్రతిఒక్కరూ అప్పులు ఇచ్చారు.

**54 మంది బాధితులు.. రూ.2కోట్ల అప్పు**

జెర్రిపోతుగూడేనికే చెందిన 54 మంది వద్ద నుంచి అతడు రూ.2 కోట్ల వరకు అప్పు తీసుకున్నాడు. ఒక్కరే రూ.10లక్షల వరకు అప్పు ఇచ్చిన వారు ఉన్నారు. తీసుకున్న డబ్బులు సరైన సమయానికి ఇవ్వకపోవడంతో ఒకరి ద్వారా ఒకరు అప్పు ఇచ్చిన 54మంది బయటకొచ్చారు. వారంతా అతడి ఇంటికి వెళ్లి డబ్బులు అడగడంతో పరారయ్యాడు. చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని పలువురు బాధితులు పేర్కొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వలిగొండ: వలిగొండ మండలంలోని సంగెం గ్రామ సమీపంలో గల భీమలింగం కాల్వ కత్వ వద్ద బుధవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని సింగన్నగూడేనికి చెందిన బీర సురేష్ (45) వలిగొండ మండలం సంగెం గ్రామ సమీపంలోని భీమలింగం కాల్వ కత్వ నీటిలో అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉన్నాడు. అటుగా వెళుతున్న గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మృతుని మెడ చుట్టూ, శరీరంపై గాయాలు ఉన్నాయి. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంగెం గ్రామ పంచాయతీ కార్యదర్శి జితేందర్రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

# అమరవీరుల స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రజాపాలన

● పీసీసీ మాజీ అధ్యక్షుడు వి. హన్మంతరావు


అమరవీరుల స్మారక స్థూపం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వి. హన్మంతరావు

శాలిగౌరారం: అమరవీరుల స్ఫూర్తితోనే తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనను అందిస్తున్నారని ఏఐసీసీ నాయకుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి. హన్మంతరావు అన్నారు. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారికి స్మారక స్థూపం నిర్మించేందుకు బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరుల త్యాగాలను గుర్తిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అందుకోసం సాహసోపేతమైన నిర్ణయాలతో ముందుకు సాగుతోందన్నారు. ఆనాడు రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలకు ఉమ్మడి నల్లగొండ జిల్లానే కేంద్రబిందువు అయ్యిందని అన్నారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మతో పాటు అనేక మంది పోరాటంతోనే నిజాం పాలన నుంచి విముక్తి కలిగిందన్నారు. చరిత్ర తెలియకుండా కొంతమంది నాయకులు తమ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు సరికాదన్నారు. వల్లాల అవరవీరుల కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. తన సొంత ఖర్చులు రూ.3లక్షలతో అమరవీరుల స్మారక స్థూపం నిర్మాణ పనులను ఆగస్టు 15 నాటికి పూర్తిచేసి సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరింపజేస్తానన్నారు. భూమి పూజ తర్వాత ఆయన స్వయంగా కంకర, ఇసుక, సిమెంట్‌ను తలపై మోసి తాపీ మేస్త్రీలకు అందించారు. కార్యక్రమంలో ఏఐసీసీ నాయకుడు ఎంఏ బాసిత్, పీసీసీ నాయకుడు శ్రీకాంత్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, దండ అశోక్‌రెడ్డి, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్, మాధారంకలాన్ మాజీ ఎంపీటీసీ నోముల జనార్దన్, కట్టంగూరి శ్రీను, సురేందర్‌రెడ్డి, విజయ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### వికసించిన మే పుష్పం


నేరేడుచర్లలోని శ్రీసాయి అపార్ట్‌మెంట్‌లో నిమ్మగడ్డ సుబ్బారావు-అన్నపూర్ణ ఇంట్లో మే పుష్పం వికసించింది. ప్రతి సంవత్సరం మే నెలలో తమ ఇంట్లోని పూల కుండీలో మే పుష్పం వికసిస్తుందని సుబ్బారావు తెలిపారు. - నేరేడుచర్ల

### గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

తిప్పర్తి: తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లగొండ-రాయినిగూడెం రైల్వే లైన్ ఎఫ్‌సీఐ గోదాం సమీపంలో రైలు పట్టాల పక్కన బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని, 5.5 అడుగుల ఎత్తు ఉంటాడని రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712658595 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మాడ్గులపల్లి: ట్రాక్టర్‌ను వెనుక నుంచి బొలేరో వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మాడ్గులపల్లి ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామానికి చెందిన గంధం వీరయ్య, నల్లగంతుల రామయ్య(50), కుర్ర మాధవ్, కొండ నాగయ్యతో పాటు మరికొందరు వ్యక్తులు మాడ్గులపల్లి మండలం దాచారం చెరువులో చేపలు పట్టేందుకు బుధవారం ఉదయం ట్రాక్టర్‌లో వస్తున్నారు. ఈ క్రమంలో మాడ్గులపల్లి మండల కేంద్రం శివారులో గల భారత్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే.. మిర్యాలగూడ వైపు నుంచి వస్తున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న వ్యక్తులు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ యజమాని గంధం వీరయ్య, నల్లగంతుల రామయ్యకు గాయాలు కావడంతో వారిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నల్లగంతుల రామయ్య మృతిచెందాడు. మృతుడి భార్య నల్లగంతుల నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి కుమార్తె ఉంది.

### తాళం వేసిన ఇళ్లలో చోరీ

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని గాంధీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో బుధవారం పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారం, నగదు అపహరించారు. గాంధీనగర్‌లో నివాసముంటున్న శ్యాంసుందర్‌రావు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 4తులాల బంగారం, రూ.10వేల నగదును అపహరించారు. బుధవారం ఊరి నుంచి వచ్చిన శ్యాంసుందర్‌రావు కుటుంబ సభ్యులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

### కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో నివాసముంటున్న ఏరుకొండ రామకృష్ణ బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. అయితే స్థానికులకు మాత్రం 13 తులాల బంగారం, రూ.42 వేల నగదు పోయిందని చెప్పిన ఏరుకొండ రామకృష్ణ.. పోలీసులు వచ్చాక ఏమీ పోలేదని చెప్పడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదే విషయమై ఎస్‌ఐ రామ్మూర్తిని వివరణ కోరగా.. దొంగతనం జరిగినప్పటికీ ఆ ఇంట్లో ఎలాంటి సొమ్ము, నగదు పోలేదని తెలిపారు.

### దాబాల్లో మద్యం విక్రయాలు

● ఇద్దరు దాబా నిర్వాహకులపై కేసు నమోదు

ఆలేరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు దాబా నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు బుధవారం ఆలేరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావు పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కందిగడ్డతండా రోడ్డు మార్గంలో బానోతు మహేష్, రవీందర్ పక్కనే దాబాలు నడిపిస్తున్నారు. అక్కడికి వచ్చే వారికి మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు రెండు దాబాల్లో తనిఖీలు చేశారు. మహేష్‌కు చెందిన దాబాలో 8లీటర్లు, రవీందర్ దాబాలో 13 లీటర్ల మద్యం, బీరు బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

● 15తులాల వెండి కిరీటం అపహరణ

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు దేవాలయం తాళం పగులగొట్టి స్వామివారి 15 తులాల వెండి కిరీటంతో పాటు హుండీ తాళం పగలగొట్టి అందులోని నగదును అపరించారు. గ్రామానికి చెందిన కొందరు మహిళలు బుధవారం ఉదయం బోరు పంపు నుంచి నీళ్లు తీసుకెళ్లేందుకు వచ్చిన సమయంలో ఆలయం తాళం పగిలి ఉండటం గమనించి ఆలయ పూజారి నరసింహాచార్యులు సమాచారం అందించారు. పూజారి పోలీసులకు విషయం తెలుపగా.. ఎస్‌ఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకుని దర్యాప్తు చేపట్టారు.

### యువతిపై దాడి చేసిన యువకుడికి జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): యువతిపై దాడి చేసిన యువకుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు మూడో అదనపు జడ్జి డి. దుర్గాప్రసాద్ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ మండలం కాకులకొండారం గ్రామానికి చెందిన బాకీ ప్రియాంక వృత్తి విద్యా కోర్సు చదువుతోంది. ఆమెకు మేళ్లదుప్పలపల్లి గ్రామానికి చెందిన మనమద్దె సాయిరాంతో ఓ ఫంక్షన్‌లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ప్రియాంకను ప్రేమ పేరుతో సాయిరాం వేధిస్తూ ఉండేవాడు. ప్రియాంక ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు చెప్పగా నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సాయిరాంపై బైండోవర్ కేసు నమోదైంది. పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ పెట్టి సాయిరాంను హెచ్చరించినప్పటికీ అతడిలో మార్పు రాలేదు. అయితే ప్రియాంక వృత్తి విద్యా కోర్సులో భాగంగా కంచనపల్లి ప్రభుత్వ పాఠశాలలో టీచింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా.. 2024 ఆగస్టు 28న నల్లగొండ పట్టణానికి చెందిన ఆవుల నందినితో కలిసి సాయిరాం కంచనపల్లి పాఠశాల వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రియాంకతో సాయిరాం మాట్లాడుతుండగా.. ఆమె తనకు ఇష్టం లేదని చెప్పి తిరిగి వెళ్తుండగా సాయిరాం ఆమె మెడలోని చున్నీని గుంజి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. అతడి నుంచి తప్పించుకున్న ప్రియాంక సాయిరాంతో పాటు అతడికి సహకరించిన నందినిపై నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ రాఘవరావు, ఎస్‌ఐ సైదాబాబు కేసు నమోదు చేసి విచారణ జరిపి సాయిరాం, నందినిపై చార్జిషీటు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. జవహర్‌లాల్ వాదనలతో ఏకీభవించిన జడ్జి దుర్గాప్రసాద్ సాయిరాంపై నేరం రుజువు కావడంతో బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం ఏడేళ్ల ఆరు నెలల జైలుశిక్ష, రూ.8వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. మొదటి నేరం కింద నందిని కోర్టు నిర్దోషిగా పరిగణించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఎన్ఎస్ యాక్టు ప్రకారం శిక్ష విధించిన మొదటి కేసు ఇదే కావడం విశేషం.

# రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి


మట్టి నమూనా సేకరించే విధానంపై అవగాహన కల్పిస్తున్న గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్

పెన్‌పహాడ్: ప్రతి రైతు భూసారాన్ని తెలుసుకునేందుకు భూసార పరీక్షలు చేయించుకోవాలని గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం మృత్తిక శాస్త్రవేత్త ఎ. కిరణ్ అన్నారు. బుధవారం పెన్‌పహాడ్ మండలంలోని యల్లప్పకుంట తండాలో భూసార పరీక్షలకు మట్టి నమూనాలను సేకరించే విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు భూసారానికి అనుగుణంగా ఎరువులు వాడితే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. భూసార పరీక్షలు చేయడం ద్వారా భూమిలోని చౌడు, సున్నం శాతాన్ని గుర్తించవచ్చని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లోని మట్టిని సేకరించి గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి పంపిస్తే భూసార పరీక్ష చేసి భూ ఆరోగ్య పత్రాలు అందజేస్తామని తెలిపారు. మట్టి నమూనాలు సేకరించే విధానానికి 7893989055 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే యంగ్ ప్రొఫెషనల్ జి. సంతోష్, సిబ్బంది బచ్చు వెంకటేశ్వర్లు, రైతులు బి. సైదా, జి. వెంకన్న, జి. సుధాకర్, భీమ్లా, పద్మ, సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

### బేస్‌బాల్ జాతీయ జట్టుకు పలివెల వాసి ఎంపిక


శివకుమార్

మిర్యాలగూడ: మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన గుత్తి శివ కుమార్ బేస్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపికైనట్లు మిర్యాలగూడకు చెందిన బేస్‌బాల్ కోచ్, బేస్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ చిర్ర మల్లేష్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన శివకుమార్‌కు బేస్‌బాల్ క్రీడ పట్ల ఉన్న ఆసక్తిని గమనించి తాను నల్లగొండ జిల్లా కేంద్రంలో శిక్షణ ఇచ్చినట్లు మల్లేష్‌యాదవ్ తెలిపారు. ఇరాన్ దేశంలో రేపటి నుంచి 21వ తేదీ వరకు జరిగే బేస్‌బాల్ వెస్ట్ ఏషియా కప్ ఇరాన్-2025 ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో భారత జట్టు తరఫున శివకుమార్ ఆడనున్నట్లు పేర్కొన్నారు. శివకుమార్ భారత జట్టుకు ఎంపిక కావడం పట్ల అమరావతి సైదులు, పాశం నరసింహారెడ్డి, ఉస్మాన్ షేక్, పరమేష్, శంకర్, మౌనిక, మహేష్, స్వామి, పవన్, రవి తదితరులు అభినందనలు తెలిపారు.

### కౌలు రైతుల నిరసన


నిరసన తెలుపుతున్న కౌలు రైతులు

తుర్కపల్లి: కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని తుర్కపల్లికి చెందిన కౌలు రైతు రాపోలు నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కౌలు రైతులకు న్యాయం చేయాలంటూ ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2011 సాగుదారు గుర్తింపు కార్డుల చట్టాన్ని వానాకాలం సీజన్ నుంచి అమలు చేయాలని కోరారు. కౌలు రైతులకు రైతు బీమా, రైతు భరోసా, పంటల బీమా, పంట నష్ట పరిహారం, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలన్నారు.

### వైభవంగా చక్రతీర్థస్నానం


మట్టపల్లిలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న యాజ్ఞీకులు, అర్చకులు, ధర్మకర్తలు

మఠంపల్లి: మట్టపల్లిలో కొనసాగుతున్న తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం అర్చకులు కృష్ణానదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామిఅమ్మవారికి చక్రతీర్థ స్నానం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో పూర్ణాహుతి చేపట్టారు. యాజ్ఞీకులు బొర్రా వెంకటవాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో ప్రాతః కాలార్చన, సుప్రభాత సేవ, ద్రవిడ ప్రబంధసేవాకాలం, పంచామృతాభిషేకం, మంత్ర పుష్ప నీరాజనాలతో శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి సమగ్ర కుంకుమార్చన చేశారు. శ్రీస్వామి అమ్మవార్లను పల్లకిలో కృష్ణానదిలోని ప్రహ్లాద ఘాట్‌కు తరలించి వసంతసేవ, చక్రస్నానం నిర్వహించారు. ఆలయ ప్రవేశం అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేశారు. సాయంత్రం దోపుఉత్సవం, ధ్వజారోహణం, మౌనబలి నిర్వహించారు. గురువారం రాత్రి పవళింపుసేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. ఈకార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.